ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్
1
RNI No: APTEL/2023/87888
మంగళవారం
07 అక్టోబర్ 2025

2001లో ఈ రోజున.. :ఆసక్తికరంగా మోదీ పోస్ట్

అక్టోబర్ 7, (రిపబ్లిక్ న్యూస్):ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. 2001లో సరిగ్గా ఇదేరోజు నాటి చిత్రాలను షేర్ చేశారు. ఆ రోజు ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. "2001 ఇదే రోజున.. గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేశాను.

నా తోటి భారతీయులు నిరంతరం అందిస్తోన్న మద్దతుకు కృతజ్ఞత తెలియజేస్తున్నాను. ప్రభుత్వాధినేతగా 25వ ఏడాదిలోకి అడుగుపెడుతున్నాను. ఈ ప్రయాణంలో ప్రజల జీవితాలు మెరుగుపర్చడం కోసం, దేశ పురోగతికి నావంతు ప్రయత్నం కొనసాగిస్తూనే ఉన్నాను" అని మోదీ తన పోస్టులు రాసుకొచ్చారు. అలాగే గుజరాత్ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ప్రమాణం చేసిన నాటి చిత్రాలను షేర్ చేశారు. మోదీ 2001 నుంచి 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన వాతావరణ మార్పులకు వినూత్న పరిష్కారాలను రూపొందించేందుకు క్లైమేట్ ఛేంజ్ డిపార్ట్మెంట్ను ఏర్పాటుచేశారు. 2001లో ఆయన స్వరాష్ట్రం గుజరాత్ భూకంపంతో అతలాకుతలమైన సంగతి తెలిసిందే. అలాంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు కొత్త వ్యవస్థలు తీసుకువచ్చారు. తన గుజరాత్ మోడల్ 2014 సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచి, ఎన్డీయేను విజయతీరాలకు చేర్చారు. వరుసగా మూడుసార్లు ప్రధాని పదవిని చేపట్టారు.

కరూర్ తొక్కిసలాట.. బాధిత కుటుంబాలకు విజయ్ వీడియో కాల్

అక్టోబర్ 7, (రిపబ్లిక్ న్యూస్): టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈనేపథ్యంలో మృతుల కుటుంబాలతో మంగళవారం విజయ్ వీడియోకాల్లో మాట్లాడారు. వారిని ఓదార్చిన ఆయన.. త్వరలో కరూర్లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. ఈమేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కరూర్ విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది.

ఈ ఘటనకు సంబంధించి టీవీకేకు సంబంధించిన కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం.. ఆ తర్వాత సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. మరోవైపు.. ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు రూపొందించేవరకు హైవేలపై ఏ రాజకీయ పార్టీ సభలకు పోలీసులు అనుమతివ్వరని తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. ఈ విషాదం వేళ విజయ్పై రాజకీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "ఇలాంటి బాధాకరమైన పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదు. ఇలాంటి సమయంలో నేను కరూర్కు వెళితే.. అసాధారణ పరిస్థితులకు దారితీయొచ్చు. త్వరలోనే బాధిత కుటుంబాలను కలుస్తా" అని ఇటీవల వెల్లడించారు. కాగా.. కరూర్ ఘటనాస్థలిని సోమవారం ఎంఎన్ఎం అధినేత కమల్హాసన్ పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. తమిళగ వెట్రి కళగం (టీవీకే) సభలో తప్పు జరిగిందని, దానిని ఒప్పుకొని బాధితులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దాన్ని కప్పిపుచ్చుకొనేలా ఇతరులపై నిందలు వేయడం సరికాదన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల ఐటీ సోదాలు

హైదరాబాద్, అక్టోబర్ 7, (రిపబ్లిక్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల ఐటీ సోదాలు జరుగుతున్నాయి. ఏపీ, తెలంగాణలోని 25 చోట్ల అధికారులు తనిఖీలు చేపట్టారు. రూ.300కోట్ల దాల్ ట్రేడ్ కేసులో హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. ఏపీలో గత ప్రభుత్వ హయాంలో పలు ట్రేడింగ్ కంపెనీలు భారీగా నగదు లావాదేవీలు జరిపినట్లు అధికారులు చెబుతున్నారు. 2024 ఎన్నికల సమయంలోనూ భారీగా నగదు విత్డ్ చేసినట్లు ఐటీ శాఖ గుర్తించింది. పలు ట్రేడింగ్ కంపెనీలు పౌరసరఫరాల శాఖ నుంచి అనుమతులు పొంది పప్పు దినుసులు సరఫరా చేయకపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలోనూ విశాఖపట్నంలో హిందుస్థాన్ ట్రేడర్స్, కర్నూలుల వీకేర్ గ్రూప్లో సోదాలు జరిగాయి.

కనిగిరిలో ట్రేడింగ్ యాప్ పేరుతో మహిళ టోకరా.. రూ.1.16 కోట్లు మోసపోయిన వ్యాపారి

కనిగిరి, అక్టోబర్ 7, (రిపబ్లిక్ న్యూస్): ట్రేడింగ్ యాప్ పేరుతో ప్రకాశం జిల్లా కనిగిరిలో ఘరానా మోసం చోటుచేసుకుంది. ట్రేడింగ్ యాప్ లో డబ్బులు పెట్టి ఓ వ్యాపారి రూ.1.16 కోట్లు మోసపోయాడు. కనిగిరికి చెందిన ఓ వ్యాపారికి ఫేస్బుక్లో ఓ మహిళ పరిచయమైంది. అనంతరం ట్రేడింగ్ యాప్లో డబ్బులు పెట్టాలని వ్యాపారికి ఆమె సూచించింది. ఆ మాటలు నమ్మి ఆయన రూ.1.16 కోట్లు యాప్లో పెట్టుబడిగా పెట్టాడు. ఆ డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వ్యాపారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రిపబ్లిక్ సినిమా CINEMA

సినిమాలో పాములు.. 'కార్తికేయ' చిత్రాన్ని వదులుకున్న నరేశ్

మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన 'కార్తికేయ' చిత్రం టాలీవుడ్లో కొత్త ట్రెండ్ సెట్ చేసింది. హీరో నిఖిల్ కెరీర్లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ నిలిచింది. సుమారు రూ.6 కోట్ల బడ్జెట్తో రూపొందిన ఈ సినిమా దాదాపు రూ.20 కోట్లు వసూళ్లు సాధించింది. మరి, ఈ సినిమాలో అల్లరి నరేశ్ నటిస్తే ఎలా ఉంటుందో ఊహించుకోండి! ఎందుకంటారా..? ముందుగా ఈ కథను దర్శకుడు చందూ మొండేటి.. నరేశ్కే వినిపించారు. స్టోరీ తనకు బాగా నచ్చినా ఒక్క కారణంతో ఆయన ఈ చిత్రంలో నటించేందుకు అంగీకరించలేదు. అదేంటంటే.. సుబ్రహ్మణ్యపురం అనే గ్రామంలో సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో పాములు ఎక్కువగా కనిపించిన సంగతి తెలిసిందే. ఆ సన్నివేశాలే ఈ సినిమాకి కీలకం. వ్యక్తిగతంగా తనకు పాములంటే భయపడడం వల్ల నరేశ్ ఆ సినిమాని తిరస్కరించారట. ఓ ఇంటర్వ్యూలో ఆయనే ఈ వివరాలు పంచుకున్నారు. బయటేకాదు సినిమాల్లో కనిపించే పాముల దృశ్యాలను చూసినా ఇప్పటికీ భయపడతానన్నారు. 2014 అక్టోబరు 14న విడుదలైన ఈ సినిమాకి సీక్వెల్గా 'కార్తికేయ 2' రూపొందింది. 'కార్తికేయ' పార్ట్ 2 నిఖిల్కి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చింది. ఒకవేళ అల్లరి నరేశ్ 'కార్తికేయ'లో నటించి ఉంటే అప్పటి నుంచే ఆయన సీరియస్ కథల్లో కనిపించేవారేమో. సీరియస్ లుక్లో ప్రేక్షకులు తనని అంగీకరిస్తారా, లేదా? అనే సందేహానికి 'మహర్షి' చిత్రంలో పోషించిన రవిశంకర్ పాత్ర జవాబుగా నిలిచిందని, ఆ క్యారెక్టరే పవర్ఫుల్ స్టోరీల్లో నటించేందుకు ధైర్యాన్నిచ్చిందని నరేశ్ మరో సందర్భంలోనూ పంచుకున్నారు. వరుసగా యాక్షన్ తరహా సబ్జెక్టుకే పరిమితం కాకుండా కామెడీ సినిమాలూ చేస్తుంటానని చెప్పారు.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

రవీంద్ర జడేజాను అదనపు లగేజీగా చూస్తున్నారా?: టీమిండియా మాజీ కికెటర్

టీమ్ ఇండియా అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఈనేపథ్యంలో మూడు వన్డేలు, అయిదు టీ20లు ఆడనుంది. దీనికి సంబంధించి బీసీసీ ఇటీవలే స్క్వాడ్ను ప్రకటించింది. అయితే వన్డే జట్టులో ఆల్రౌండర్ రవీంద్ర జడేజాకు చోటు కల్పించలేదు. అటు బ్యాట్తోనూ, ఇటు బంతితోనూ అద్భుతంగా రాణిస్తున్న రవీంద్ర జడేజాను ఎంపిక చేయకపోవడాన్ని టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ సదగోపన్ రమేశ్ తప్పుబట్టాడు. అతన్ని బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ అదనపు లగేజీగా చూస్తున్నారా.. అంటూ ప్రశ్నించాడు. 'ఛాంపియన్స్ ట్రోఫీకి మేం అదనపు స్పిన్నర్లను తీసుకున్నాం.. కాబట్టి జడేజా టీమ్లో ఉన్నాడని సెలక్టర్ అగార్కర్ చెబుతున్నారు. అంటే రవీంద్ర జడేజాను అదనపు లగేజీగా చూస్తున్నారా? అతడో వైట్బాల్ లెజెండ్. మీకు అదనపు స్పిన్నర్లు అవసరమైతేనే అతన్ని జట్టులోకి తీసుకుంటారా? శుభ్మన్ గిల్ టీ20 జట్టుకు వైస్ కెప్టెన్, వన్డే జట్టుకు కెప్టెన్గా చేయడానికి మీరిచ్చిన సమాధానం.. అతడు ఇంగ్లాండ్ టూర్లో రాణించాడని. ఆ పర్యటనలో రవీంద్ర జడేజా కూడా అద్భుతమైన ప్రదర్శనలే చేశాడు' అని సదగోపన్ రమేశ్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా ప్రశ్నలు సంధించాడు. 'మీరు ధ్రువ్ జురేలు వెస్టిండీస్లో తో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్లో సెంచరీ చేశాడని ఎంపిక చేశారు. జడేజా అదే మ్యాచ్లో శతకం కొట్టడంతో పాటు, బౌలింగ్లో నాలుగు వికెట్లు కూడా తీశాడు. అయితే సెలక్టర్లు ధ్రువ్ జురేల్, శుభ్మన్ గిల్ను గుర్తించారు. జడేజాకేమో గుడ్డి చెప్పారు' అంటూ అతడు చురకలంటించాడు.'ప్రస్తుతానికి ఇద్దరు ఎడమచేతి వాటం స్పిన్నర్లను ఆస్ట్రేలియాకు తీసుకెళ్లడం సాధ్యం కాదు. జడేజా సమర్థుడే. బ్యాటింగ్, బౌలింగ్ తోపాటు ఫీల్డింగ్ అద్భుతంగా చేస్తాడు. అతను ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో ఉన్నాడు. ఎందుకంటే అక్కడి పరిస్థితుల కారణంగా మేము ఆ అదనపు స్పిన్నర్లను తీసుకున్నాం. ఇప్పుడు మేము ఒకరికే అవకాశం ఇవ్వగలం. వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్లతో జట్టులో సమతుల్యతను కాపాడుకోగలం. ఆస్ట్రేలియాలో మనకు అంతకంటే ఎక్కువ అవసరం ఉంటుందని నేను అనుకోను. ఇది కేవలం మూడు మ్యాచ్ల చిన్న సిరీస్. అందరికీ అవకాశం ఇవ్వలేము. దురదృష్టవశాత్తూ ఈసారి జడేజా మిస్ అవుతున్నాడు. కానీ అది అంతకుమించి ఏమీ కాదు' అని బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్.. ఆసీస్లో వన్డే, టీ20 మ్యాచ్లకు భారత స్క్వాడ్ను ప్రకటించిన అనంతరం వివరించాడు.

ఇంటి చిట్కాలు

తులసి, వేపాకులతో దంతాలపై పాచి వదిలించుకోవచ్చు, ఎలా వాడాలంటే

ఇంకొందరు రోజూ రెండు పూటలా బ్రష్ చేస్తారు. కానీ, వారి పళ్ళు కూడా పసుపు రంగులోకి మారతాయి. ఇక, ఈ సమస్యలు ఉంటే చాలా మంది దంత వైద్యుల చుట్టూ ప్రదిక్షణలు చేస్తారు. వేల రూపాయ-ఎల్లో ఖర్చుపెడతారు.

దంతాలు ముఖ సౌందర్యంలో కీలక పాత్ర పోషిస్తాయి. పళ్ళు తెల్లగా ముత్యాల్లా మెరిసిపోవాలని చాలా మంది కోరుకుంటారు. దంతాలు తెల్లగా మెరిసిపోతే మనలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అదే పళ్ళు పాచి పట్టి పసుపు రంగులోకి మారితే.. చాలా ఇబ్బందిగా ఉంటుంది. అందరిలో ఉన్నప్పుడు నవ్వడానికి చాలా తంటాలు పడాల్సి ఉంటుంది. ఈ రోజుల్లో చాలా మంది దంతాలు పాచి పట్టి పసుపు రంగులోకి మారిపోతాయి. పళ్లు తోమే విషయంలో బద్ధకం, ఎప్పుడూ పడితే అప్పుడు తినడం, కెఫీన్ ఉండే డ్రింక్స్ ఎక్కువగా తీసుకోవడం, సిగరెట్లు ఎక్కువగా తాగడం వల్ల దంతాలు పసుపు రంగులోకి మారతాయి. ఇంకొందరు రోజూ రెండు పూటలా బ్రష్ చేస్తారు. కానీ, వారి పళ్ళు కూడా పసుపు రంగులోకి మారతాయి. ఇక, ఈ సమస్యలు ఉంటే చాలా మంది దంత వైద్యుల చుట్టూ ప్రదిక్షణలు చేస్తారు. వేల రూపాయల్లో ఖర్చుపెడతారు. మీరు కూడా పసుపు దంతాలతో ఇబ్బంది పడుతుంటే.. వాటి తెల్లగా మార్చే సహజ ఇంటి చిట్కాలు ఉన్నాయి. కొన్ని సహజ పదార్థాలు, పెరట్లో దొరికే ఆకులు దంతాల పసుపు రంగును తగ్గిస్తాయి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.

తులసి ఆకులు

తులసి ఆకుల్లో శరీరానికి మేలు చేసే ఎన్నో పోషకాలు ఉంటాయి. తులసి ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, క్రిమినాశక మూలకాలు ఉంటాయి. ఇవి నోటి ఆరోగ్యాకి ఎంతో మేలు చేస్తాయి. తులసి ఆకుల్ని నమలడం వల్ల దంతాల్ని శుభ్రంగా ఉంచుకోవచ్చు. చిగుళ్ల ఆరోగ్యం కోసం తులసి ఆకుల్ని నమలాలి. తులసి ఆకులు నమలడం ద్వారా దంతాల పాచి కూడా వదిలించుకోవచ్చు.

తులసి ఆకుల్ని ఎలా వాడాలి?

ఉదయం పళ్లు తోముకున్న తర్వాత 5-6 తులసి ఆకులను నీటితో కడిగి శుభ్రం చేసుకోవాలి. ఆ తరువాత, ఆకులను నెమ్మదిగా నమలండి. తులసి ఆకుల నమలడం ద్వారా అందులో యాంటీ బ్యాక్టీరియల్, క్రిమినాశక మూలకాలు నోటిలోని బ్యాక్టీరియాను తగ్గిస్తాయి. తులసి ఆకుల్ని నమిలి తినవచ్చు. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల దంతాలపై పసుపు రంగు తగ్గిపోతుంది.

వేపాకులు

చాలా మంది వేప పుల్లల్ని దంతాల్ని శుభ్రపర్చుకోవడానికి ఉపయోగిస్తారు. ఆయుర్వేదంలో వేపాకులు దంతాల ఆరోగ్యానికి ఉపయోగిస్తారు. కావిటీస్, దంత క్షయాన్ని తగ్గించడంలో వేపాకులు బాగా ఉపయోగపడతాయి. వేపాకుల్లో యాంటీ బ్యాక్టీరియల్ మూలకాలు కనిపిస్తాయి. ఈ మూలకాలు దంతాల్లోని బ్యాక్టీరియాను తగ్గిస్తాయి. అంతేకాకుండా నొప్పి, వాపు నుంచి ఉపశమనం లభిస్తుంది. రోజూ వేపాకుల్ని నమలడం ద్వారా దంతాలు, చిగళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. అంతేకాకుండా దంతాల మీద పాచి, గారె కూడా తొలగిపోతుందని నిపుణులు చెబుతున్నారు.

పుదీనా ఆకులు

పుదీనా ఆకుల్ని మౌత్ ఫ్రెషనర్గా వాడుతుంటారు. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు ఉంటాయి. పచ్చి పుదీనా ఆకులను నమలడం వల్ల దంతాల పసుపు రంగు తగ్గుతుంది. పుదీనాలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు దంతాలకు కొత్త మెరుపునిస్తాయి. పుదీనా ఆకులను రోజుకు ఒకటి లేదా రెండు-సార్లు నమలడం ద్వారా దంతాల పసుపు రంగును తగ్గించుకోవచ్చు.

దంతాల పాచికి కారణాలు

- సరిగ్గా బ్రష్ చేయకపోవడం
- పొగాకు నమిలే అలవాటు
- ధూమపానం, మద్యపానం
- ఎక్కువగా టీ, కాఫీ తాగడం
- చెడు ఆహారపు అలవాట్లు
- ఫ్లోరైడ్ అధికంగా ఉన్న నీరు తాగడం
- సోడా, కార్బోనేటెడ్ డ్రింక్స్ తాగడం
- దంతాలు ఆరోగ్యంగా ఉండాలంటే ఈ అలవాట్లకు దూరంగా ఉండండి. అంతేకాకుండా రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవడం అలవాటు చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

గమనిక..

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.